# లలిత రేఖ

ఫిబ్రవరి మూడవ వారం.

ఇంకా చలి తీవ్రత తగ్గలేదు.

న్యూఢిల్లీ నుంచి తిరిగి వచ్చేస్తున్నాడు, సదానంద్.

ఉన్ని కోటు వేసుకోకుండా కేవలం స్వెటర్ తోనే ఉండి పోవడం వివేక వంతమైన పనిగా అనిపించలేదు.

దిగులు పడవలసిన అవసరం ఏముంది?

రైలు సీట్లో సర్దుకుని కూర్చున్న తరువాత అవసరం అనుకుంటే కోటు పైకి తీసుకోవచ్చు సూట్ కేస్ లోనుంచి.

ఎంతసేపు? మధ్యాహ్నం అయిందంటే ఉక్క పోయడం ఆరంభ మవుతుంది. చొక్కా కూడా విప్పి వేయవలసిన అవసరం వస్తుంది రేపు.

కంపార్ట్‌మెంట్ వెదుక్కుంటూ ఆ చివరి వరకు వెళ్లాడు. ఎందుకైనా మంచిదని టిక్కెట్ మీద నంబర్, కంపార్ట్ మెంట్‌కు అంటించిన ఛార్ట్‌లో తన పేరు, టిక్కెట్ నంబర్ సరిచూసుకున్నాడు.

లోవర్ బెర్త్‌లో "ఇ" తనది. నిదానంగా సూట్‌కేస్ ఒక చేతి నుంచి మరో చేతికి మార్చుకుని కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించాడు. షోల్డర్ బాగు తనకంటే ముందు లోపలకు వెడతానని పోటీ పడుతోంది. దాన్ని బతిమాలి వెనక్కి నెట్టి 'ఇ' తలుపు పక్కకు నెట్టాడు.

తాపీగా సరంజామా యథాస్థానంలో చేర్చాడు.

ఇప్పుడింక చేయవలసిన పని ఏమీలేదు.

రైలు బయలు దేరేంత వరకు ఓపికగా కూర్చోవాలి.

కాఫీ తాగడం పూర్తయింది. కాటరింగ్ సర్వీస్ బాయ్ వచ్చినప్పుడు ఫల హారం, కాఫీ మళ్లీ తీసుకోవాలి. రైలు కాస్త ముందుకు సాగిన తరువాత

'రీడింగ్ మెటీరియల్' పని చూచుకోవచ్చును.

అబ్బ! ఇంటికి తిరుగు ప్రయాణం - నివృత్తి మార్గం - ఎంత హాయిగా ఆనందంగా ఉంటుంది! మొదటి ప్రయాణంలో ప్రవృత్తిలో - ఉన్న హడావిడి, తొందరపాటు, అదుర్దా ఉండవు. ఎందుచేతనో, తిరుగు ప్రయాణంలో.

మూడు రోజుల కాన్ఫరెన్స్ ఇట్లే అయిపోయింది, కన్నుమూసి తెరిచి నంతలో. ఈ కాన్ఫరెన్స్‌కు 'పేపర్' తయారు చేయటానికి తనకు నిండా ఇరవయి రోజులు పట్టింది! అంటే, పేపరు తయారు చేయడం తనకు చేత కాదనీ, బొత్తిగా కొత్త అనీ కాదు. ప్రకటించే - చదివే - ప్రతి పేపర్లోనూ తప్పని సరిగా కొత్త విషయాలు, వివరాలు ఉండి తీరాలని పట్టుదల. ఏదో లాంఛన ప్రాయంగా పేపరు చదివేసి, పూర్తి అయిందని చేతులు దులుపుకుని టి.ఏ., డి.ఏ. వసూలు చేసుకోవడం పట్ల తనకు ఆసక్తి లేదు, అలవాటు అంతకన్నా లేదు, ఎంత 'సీజన్డ్ సెమినేరియన్' అయినా.

తను చదవ వలసిన పేపర్ చదవడమే కాకుండా, కొత్తగా మరో సెషన్‌కు 'ఛెయిర్' తీసుకోవలసి వచ్చింది, ఆఖరు నిమిషంలో అందుకు ఏర్పాటు అయిన మనిషి రాకపోవడంతో. ఆ పని కూడా తనకు తృప్తి ఇచ్చేట్లు ముగించుకుని ఇవతల పడ్డాడు.

పరిచయస్థులందరూ ఆప్యాయంగా పలుకరించారు.

కొన్ని కొత్త పరిచయాలు అయినాయి. ఇవి ఏమేం ప్రతిఫలాలు తీసుకు వస్తాయో చూడాలి.

... ఎవరో వస్తున్న చప్పుడు అయింది.

పోర్టర్ పెద్ద బాక్స్ నెత్తిన పెట్టుకుని ముందుకు వచ్చాడు. ఎదురు బెర్త్ కింద ఆ బాక్స్ సర్దాడు. మరో చిన్న సూట్‌కేస్ దాని పక్కగా ఉంచాడు. అతడు బయటకు వెళ్ళిన తర్వాత ఓ అమ్మాయి లోపలకు వచ్చింది. లగేజ్ వంక తృప్తిగా చూచుకుంది. ఎదురు సీట్లో కూర్చుండిపోయింది.

సదానంద్ ఆమె వంక చూచాడు. ఆశ్చర్యంతో అతడి కళ్లు కొద్దిసేపు అట్టే ఉండిపోయాయి - ఆ ముఖాన్నే చూస్తూ.

అదే ముఖం! వయసు మాత్రం తక్కువ.

అందుకేమీ సందేహం లేదు. పట్టపగలు పొరపాటు పడడం చేతకాదు.

ఇరవయి - పైన మహా ఉంటే రెండు మూడేళ్లు ఉంటాయి ఆ అమ్మాయికి.

ఇరవై యేళ్లక్రితం - మొదటి మారుగా పరిచయం అయినప్పుడు అచ్చంగా ఇలాగే ఉండేది సురేఖ.

అదే కళ్లు. అదే ముక్కు. అలాగే బుగ్గలూను!

నుదురు కూడా ఇంతే ప్రమాణం.

మనిషిని పోలిన మనుషులు ఉంటారనేది బాగా తెలిసిన సంగతే అయినా, ఇలా ఎదురుగ్గా తన భార్యలాంటి మరో అమ్మాయిని చూడడం అతనికి ఆశ్చర్యం, సంభ్రమం, కాస్త భయం కూడా అనిపించింది.

మద్రాసు చేరుకోగానే ఎలాగూ సురేఖ ప్లాట్ ఫాం మీదనే కనిపిస్తుంది. తన కోసం కారు తీసుకు రావడం, స్వయంగా రిసీవ్ చేసుకోవడం సురేఖకు ముక్కువ. అప్పుడు సురేఖకు ఈ అమ్మాయిని చూపించాలి. పరిచయం చేయాలి. పోలికలు చప్పున స్ఫురిస్తాయో, లేదో సురేఖకు... గమనించాలి. ఇంతకూ ఈ అమ్మాయి మద్రాసు దాక వస్తుందో లేక ఈ మధ్యలోనే ఎక్కడయినా మటుమాయం అయిపోతుందో!

- ఈ అనుమానం మనసుకు తట్టడంతోటే సదానంద్ ఉలిక్కిపడ్డాడు. ఈ సంగతి ఇప్పుడే తేల్చుకోవడం మంచిది కదూ!

పరిచయం చేసుకుంటున్నట్లుగా నవ్వాడు ఒక్కమారు.

'గుడ్ మాణింగ్ మిస్ -' అన్నాడు.

'వెరీ గుడ్ మాణింగ్ సర్. అయాం సులలిత' అంది ఆ అమ్మాయి.

సురేఖకు ఒక చెల్లెలు ఉండేమో, ఆమె పేరు సులలిత అయి ఉంటుంది. ఎప్పుడో చిన్నప్పుడు తప్పిపోయి ఉంటుంది. మరెక్కడో పెరిగి ఉంటుంది. అందుకనే ఇంత కొట్టవచ్చినట్లుగా ఉన్నాయి పోలికలు... అనుకున్నాడు క్షణంలో సదానంద్.

కాని సురేఖ పుట్టింటి కుటుంబ వివరాలు తనకు తెలియనివి కాదు. సురేఖకు చెల్లెళ్లు లేరు. ఆమెకు ఇప్పుడు నలభయి అయిదు. తనకు మొన్ననే యాభై ప్రవేశించాయి గదా. ఇరవై యేళ్ళ తేడాలో సురేఖకు చెల్లెలు ఉండడం... ఎంత మాత్రం - నమ్మకంగా - సంభవం కాదు. ఇంతకూ మనసుకు తెచ్చుకున్న అనుమానం ముందుకు వచ్చి నిలుచుంది. ఈ అమ్మాయి - ఈ సులలిత మద్రాసే వస్తోందా, మధ్యలో దిగి పోతోందా!

అడిగేశాడు ముఖమాటం పడి లాభం లేదని.

'మద్రాసుకే' అంది సులలిత కొద్దిగా మందహాసం చేసి.

నవ్వు కూడా అదే! వయస్సు తీసుకు వచ్చిన గాంభీర్యం తప్ప అదే నవ్వు!

ప్రయాణం ముగిసే లోపల ఈ అమ్మాయి పేరెంటేజ్ తేల్చి వేసుకో వాలి... రైలు ముందుకు సాగిపోతున్నదనీ, అప్పుడే ఇరవయి కిలో మీటర్లు దాటి వచ్చేశామని తెలిసివచ్చింది సదానంద్‌కు, కాంటీన్ బాయ్ వచ్చి బ్రేక్ ఫాస్ట్ ముందు పెట్టినప్పుడు.

'మీరు తీసుకోరా, మిస్?' అనడిగాడు బేరర్ ఆమె వైపు తిరగటానికి ముందుగానే సదానంద్.

'నాకూ కావాలి. థాంక్స్' అంది సలలిత. బేరర్ లంచ్ డిటెయిల్స్ కూడా నోట్ చేసుకుని వెళ్లాడు.

కాఫీ ముగించిన తర్వాత తన పుస్తకాలు బయట వేసుకుని కూర్చున్నాడు సదానంద్. సులలిత ఆ పుస్తకాల వంక ఓరకంటితో చూచింది.

'కావాలంటే, ఓ పుస్తకం తీసుకోండి -'

'థాంక్స్, వద్దండీ'

హర్ట్ అవబోయి మానేశాడు సదానంద్. అందరూ పుస్తకాల పురుగులని తాను ఎందుకు అనుకోవాలి? సులలిత అతని వైఖరి కనిపెట్టి 'ఏమీ అనుకో కండి. ఫిక్షన్ మీద అంత ఇంటరెస్ట్ లేదు నాకు. అయినా, ఇంట్లో బయటా పుస్తకాలతోనే నా కాలక్షేపం!' అంది.

'ఫిక్షన్ అంటే కోపమా?'

'కాదు. సీరియస్ రీడింగ్‌కు అలవాటు పడిపోయింది మనస్సు'

'ఏం జేస్తున్నారు? పి.జి. ఆర్ డాక్టరేట్?'

'పోస్ట్ డాక్టరేట్ స్టడీస్ ఇన్ ఇంటర్‌నేషనల్ రిలేషన్స్. సౌత్ - సౌత్ వరల్డ్ గురించి ప్రత్యేకం.'

'ఓహ్!' -ఇంకేమనాలో సదానంద్‌కు తక్షణం తోచలేదు. ఆ సబ్జెక్ట్ బొత్తిగా తనకు తెలియనిది.

మళ్లీ కాస్సేపాగి 'అయితే ఫిక్షన్ చదవరన్నమాట' అన్నాడు రాజీ పడు తున్న ధోరణిలో. సులలిత నవ్వింది 'చదవను గాని చదివే వాళ్లంటే చులకన భావం లేదు లేండి' అంది.

సదానంద్ నిలదొక్కు కున్నాడు. 'ఫిక్షన్ అంటే చాలా మంది అభిప్రాయం

కేవలం కాలక్షేపం కోసం - ఉబుసు పోక కోసం చదవేది, వ్రాసేదీ... అని'

'కాదా?' అంది సులలిత ఆశ్చర్యపోతున్నట్లు.

అలా ప్రశ్నిస్తుందని ముందు ఊహించలేదు సదానంద్. 'కాదనుకుంటాను' అన్నాడు ముందు ఉపోద్ఘాతంగా.

'యదార్థం కంటే కల్పన భిన్నమైనది కాదు. నిజానికి కల్పన కంటే యథార్థమే విచిత్రమైనదని ఒక నానుడి కూడా ఉంది. కేవలం అభూత కల్పనలు, రాక్షసుల కథలు కాకుండా, ఆర్ట్ ఫాంను, సాంఘిక ప్రయోజనాన్ని మిళితం చేసిన రచనలు ఉంటాయి ప్రతి భాషలోనూ. వర్తమాన జీవితానికి ప్రతి బింబం ఇలాంటి సాహిత్యం అంతా.'

'నాకు ఈ సంగతే తెలియదు సుమండీ?' అంది సులలిత.

ఇది ఆసరాగా తీసుకుని సదానంద్ భారత భాషలలో వస్తున్న కథలు, నవలలు వాటి ఉత్కృష్టత, విశిష్టత కొంత సేపు సిద్ధాంతీకరించి చెప్పాడు. తరువాత అన్నాడు – 'మీ వయసు వాళ్లకు ఇలాంటి సాహిత్యం అంటే చిన్న చూపు ఉండటానికి కారణం లేక పోలేదు. ముఖ్యంగా యేమిటంటే - జీవితం నుంచి పారిపోయి, కేవలం ఊహలలో, అపోహలలో మాత్రమే రచనలు చేస్తారు కొందరు. అందుకని.'

'ఇంగ్లీషులో మిల్స్ అండ్ బూన్... ఇతర రొమాంటిక్ ఫిక్షన్ ఈకోవకు చెందినదే కదూ!'

'సరీగా చెప్పారు. అలాంటి పుస్తకాలకు మాస్ అప్పీల్ ఉన్నా సాహిత్య స్థాయి మాత్రం రాదు.... ఇప్పుడు భారత భాషలలో ఇటువంటి తేలిక సాహిత్యం చాల మంది మగ, ఆడ అలవోకగా వ్రాసేస్తున్నారు... ఇంతకూ మీరు మదరాసు వెడుతున్నారు గదూ!'

'అవునండీ. మాది మద్రాసే. మా నాన్నగారు అక్కడే ఉంటారు.'

'ఎక్కడ మీ ఇల్లు?'

'బెసెంట్ నగర్'

'ఓ హో. నేనూ అటే వెడతాను. మీకు వేరే ఏర్పాటు లేకపోతే, నా కారులోనే డ్రాప్ చేస్తాను.'

'థాంక్స్. కాని అవసరం లేదనుకుంటాను. మా నాన్నగారు స్టేషన్‌కు వస్తారు.'

- సదానంద్ ఇంకా మాటలు పొడిగించటానికి ముందే సులలిత 'మీకు సాహిత్యం మీద చాలా స్ట్రాంగ్ వ్యూస్ ఉన్నట్లున్నాయి. నాకు మాత్రం ఏమీ పరిచయం లేని సబ్జెక్ట్ అది' అంది.

'అదేం బ్రహ్మ విద్యకాదు. నాలుగు పుస్తకాలు చదివితే ఈ విషయాలన్నీ మీకు బహు తేలికగా అర్థం అయిపోతాయి.!'

'క్షమించండి... మీ వయసులో సగం కూడా ఉండదు నా వయసు. నన్ను - మీరు - అంటూ మీరు మన్నించడం...'

'ఓహ్ అదా...'

'ఇంగ్లీషులో మాట్లాడినప్పుడు తేడా తెలియదనుకోండి. అదే తమిళంలోనో, తెలుగులోనో మాట్లాడి నప్పుడు... మీ సంబోధన ఇట్టే పట్టి ఇచ్చేస్తుంది. మీచేత 'మీరు, మీరు' అనిపించుకోవడం నాకు సిగ్గుగా ఉంది.'

'అలాగే ఇంగ్లీషులోనే మాట్లాడుతాను లెండి?' అన్నాడు సదానంద్.

'అది కాదు నా ఉద్దేశ్యం -'

- తరువాత సంభాషణలో సదానంద్ మీరు, నీవు లేకుండా చాలా సేపు కాలక్షేపం చేయగలిగాడు.

లంచ్ అవర్ అయిన తర్వాత ఒక గంట సేపయినా నిద్రపోవడం సదానంద్‌కు అలవాటు. రైలు ప్రయాణంలో అయినా ఇందుకు భిన్నం అవనక్కర్లేదు.

హాయిగా నిద్ర పోతున్న వాడల్లా కెవ్వున కేక వినిపించి, తటాలున లేచి కూర్చున్నాడు.

ఎదురు బెర్త్‌లో సులలిత కూడా అప్పుడే కళ్లు నలుముకుంటూ లేచి కూర్చుంటూంది.

ఆ అమ్మాయి ముఖంలో ఎంతో కళవెళ పాటు, ఇంకా నిద్ర మత్తు కనిపిస్తున్నాయి సదానంద్‌కు. కెవ్వుమన్న కేక - ఈ అమ్మాయే వేసిందని అనిపించలేదు చాలా సేపటి వరకు.

'ఏమయింది? ఏమయింది?' అని అడిగాడు.

సులలిత యేమీ మాట్లాడలేదు. కాని సదానంద్ పరీక్షగా చూచే సరికి ఆమె నిలువెల్లా కంపించి పోతోందని, స్పృహ తప్పి పోయే పరిస్థితిలో ఉన్నదనీ అర్థం అయింది.

సదానంద్ తటాలున బెర్త్ మీద నుంచి లేచాడు.

ఆమెను భుజం పట్టి పిలిచాడు.

పక్కనే ఉన్న నీళ్ళ కూజాలో నుంచి చల్లటి నీళ్ళు తీసి అందించాడు.

'ఏమయింది... చెప్పరూ?' అని అడిగాడు.

సులలిత నాలుగు గుక్కలు నీళ్ళు తాగి రెండు చుక్కల్తో కళ్ళు కూడా తుడుచుకుంది.

సదానంద్ ఆమె భుజం తట్టి 'ఇప్పుడు నిదానంగా ఉందా?... అసలు ఏమ యింది?... నేను నిద్రపోయాను. నిద్రకు పడ్డానంటే మొద్దు నిద్ర నాది. ఉరుము ఉరిమితే గాని మెలుకవ రాదు' అన్నాడు.

'అయితే అంత పెద్ద కేక వేశానా? మీ నిద్ర పాడు చేశానా? క్షమించండి' అంది సులలిత.

ఇప్ప డామె వెనుకటి భయం, వణుకు పోయి మామూలుగా తయారయిం దనుకున్నాడు.

'ఏమయినా కల వచ్చిందా? కలలో భయం వేసిందా?'

'అవును' అన్నట్లుగా తల ఊపింది.

'ఏమిటంత భయం వేసే కల?' అని అడిగాడు లాలనగా.

సులలిత నుదుటి మీద చెమట బిందువులు చేరుకున్నాయి. ఈ విషయం తలుచుకోవడం తోటే భయం ముంచుకు వచ్చి కూర్చుంది.

'చాలా చెడ్డ కల'

'ఏమని?'

'రైలు పడిపోయింది.'

'అంతే...?'

'అంత తేలికగా అనుకుంటున్నారా? అదే నిజం అయిఉంటే - ఈ పాటికి మనం - ఈ రైల్లో ఉన్నవాళ్లందరం - పరలోక వాసులం అయిపోయే వాళ్ళం.'

'పగటి కల కదూ... ఆ సంగతి మరిచిపోతే ఎలా?'

'కల వస్తూ ఉన్నప్పుడు - అది పగలో, రాత్రో; కలో, నిజమో తెలియదుగా!'

సదానంద్ ఆమె ముఖంలోకి చూచాడు.

భయపడి పోయి నీరసంగా ఉంది ఆ ముఖం.

... ఇరవై ఏళ్ల క్రిందటి సురేఖ.

ఆ లేతదనం, భీభత్సం, భయం... కళవెళపాటుతో నిండిపోయినప్పుడు ఉండే ముఖవాలకం చూస్తే సదానంద్‌కు ఆమెను దగ్గరకు తీసుకుని లాలించి బుజ్జగించి వీపు నిమరాలనిపించింది.

ఇంతసేపూ సురేఖ చెల్లెలుగా ఊహించు కుంటున్నాడు ఈ అమ్మాయిని.

చెల్లెలే ఎందుకు కావాలి? కూతురు కాకూడదా - అనిపించింది క్షణం సేపు మరీ అమాయకత్వం వుణికి పుచ్చుకున్న ఈ ముఖం చూస్తూ ఉంటే...!

అవును! సురేఖ వద్దని పట్టుబట్టిగానీ, తమ కిద్దరికీ ఈ వయసు అమ్మాయి - కూతురు - ఉంటడానికి ఏమీ అభ్యంతరం లేదు. అక్కర లేదు.

తమకు పాతికేళ్ల కూతురు ఉండడమూ... ఆ అమ్మాయి రాజధాని నగరంలో జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ స్టడీస్ చేస్తూ ఉండటమూ... నిజం కాకపోవచ్చును గాని - అసంభవం మటుకు కాదు. అసంభవం ఎంత మాత్రం కాదు!

సదానంద్ ఈ మారు సులలిత వంక మరింత ఆప్యాయంగా చూచాడు.

పాపం చిన్నపిల్ల. పెద్ద చదువుల్లో ఉంటే మటుకేం గాక - నిద్రలో కలలో భయపడిపోయి బెంగ పడిపోయింది.

తండ్రి లాంటి తను లాలించి ధైర్యం చెప్పవలసిన సమయం ఇది. ఊరట కలిగించడం కనీసధర్మం.

'మరేం భయపడకు అమ్మాయీ, మనం సురక్షితంగానే ఉన్నాం' అన్నాడు 'మరేం బెంగపడకు'

'మీరు అంత ధైర్యం చెబుతున్నారు గనుక - నాకు చాలా సంతోషంగా ఉంది. అయినా అధైర్యం నన్ను ముంచేస్తోంది' సులలిత వణుకుతూ ఉండడం సదానంద్‌కు స్పష్టంగా కనిపిస్తోంది.

'ఏమిటమ్మా బొత్తిగా చిన్న పిల్లవయి పోతున్నావు?' ఇంత కంటే ధైర్యం చెప్పడం ఎలాగో అతనికి తెలియడం లేదు.

ప్రమాదం జరిగితే - అందరూ మరణిస్తే కథే లేదు.

అదీ గాక, మనిషన్న వాడు ఎప్పుడో ఒకప్పుడు మరణించి తీరాలి తప్ప శాశ్వతంగా ఉండిపోవటానికి కుదరదు గద!... ఈ రకమైన ఫిలాసఫీ బిల్డ్ చేసుకున్నాడు సదానంద్. అయితే అది ఈ సమయంలో సులలితకు ఇంజెక్ట్

చేయడం బుద్ధిమంతమైన పనికాదని స్పష్టంగా చెబుతోంది వివేకం.

'మన రైలుకు ఏమీకాదమ్మా నేను గ్యారంటీ... నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డం వేస్తాను, అంతగా అయితే. నువ్వేం భయపడకు'

ఆ సాయంత్రం అంతా చాలా ధైర్యంపాలు పోస్తూనే ఉన్నాడు.

రాత్రి భోజనం అయిన తర్వాత సులలిత చాలా సేపు పడుకోలేదు. నిద్ర పోతే రైలు ప్రమాదం జరిగితే... తెలియదేమో - మెలుకువగా ఉంటే ఎందుకయినా మంచిది. ఇదీ ధోరణి.

సదానంద్‌కు చాలా జాలి వేసింది.

ఏమిటి ఈ ఫోబియా - ఇంత చదువుకున్న పిల్లకు?

సదానంద్ చెబుతూ ఉన్న కథల లాంటి జీవితం కబుర్లు వింటూ సులలిత ఏ పన్నెండు గంటలకో నిద్రపోయింది.

ఆమె నిద్రపోయిందని నిర్ధారణ అయినాక, దుప్పటి ముసుగు తిన్నగా సర్ది, తాను కూడా నడుం వాల్చాడు. కలలు లేని నిద్రల ప్రపంచంలోనికి దూసుకుపోయాడు.

భళ్లున తెల్లవారింది.

కాఫీలు, ఫలహారాలు, న్యూస్‌పేపర్లు, కబుర్లు, పరామర్శలు, ఉభయ కుశలోపరులు... వాళ్ళనిద్దరినీ బిజీగా ఉంచాయి, మద్రాసు చేరేంత వరకు.

'నిన్న చాలా భయపడి పోయాను... నిజంగానే రైలు పడిపోయిందనీ, నేను చనిపోయాననీ....'

'ఆ సంగతి గుర్తు చేసుకోకమ్మా. రైలు పడిపోలేదు. పడిపోయినా నీకు ఏ ప్రమాదం లేదు. హాయిగా వెయ్యి వసంతాలు వర్ధిల్లు' అన్నాడు సదానంద్.

మదరాసు సెంట్రల్ ప్లాట్‌ఫాం మీద సురేఖ కనిపించడం తోటే ముఖం లోనికి కొత్త ఉత్సాహం వచ్చింది సదానంద్‌కు.

'ఈ అమ్మాయిని మనతో తీసుకుపోవాలి, వాళ్ల నాన్నగారు రాకపోతే?' అన్నాడు భార్యతో.

'అక్కర్లేదండీ. అరుగో, మా నాన్న అటుపక్క నుంచి వస్తూనే ఉన్నారు. ఆ గ్రీన్ శాలువ కప్పుకుని... రైలు ప్రయాణంలో మీ సహాయానికి చాలా థాంక్స్. మీరు లేకపోతే నేను యేమైపోయేదాన్నో' అంది సులలిత.

సదానంద్ ఆమె చెయ్యి నొక్కి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు, సురేఖతో

పాటు, సులలితకు టా - టా - చెబుతూ. సదానంద్‌చేయి తన చేతిలోనికి తీసుకని వడి వడిగా ప్లాట్ ఫాం దాటుతోంది సురేఖ.

'ఆ అమ్మాయిని గమనించావా? అచ్చం నీ పోలికే గదూ -' అన్నాడు సదానంద్, ఇంటికి వెళ్ళేంత వరకూ ఆగితే ఈ విషయం మరిచి పోతానేమో నని భయపడుతున్నట్లుగా.

సురేఖ అతని ముఖంలోనికి ప్రశ్నార్థకంగా చూస్తూ 'చాల్లెండి, ఎవరైనా వింటే నవ్విపోతారు.' అంది.

'ఎందుకని?'

'ఆ అమ్మాయిది చంద్రబింబం లాంటి గుండ్రని ముఖం'అంది సురేఖ.

సదానంద్‌కు ఇంకేమనటానికి వెంటనే స్ఫురించలేదు.